రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి : కలెక్టర్

సమావేశంలో పాల్గొన్న అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కోరారు. 'రోడ్డు భద్రత' అనే అంశంపై ఎస్పీ రోహిత్‌రాజుతో జిల్లా స్థాయి అధికారులతో ఐడీవోసీలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరూ వైకల్యం భారిన పడకుండా, ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా, రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల వివరాలు నమోదు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, డీసీహెచ్‌ఎస్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

407 అడుగులకు 'కిన్నెరసాని' నీటిమట్టం

ఈ సీజన్‌లో తొలిసారి పూర్తిగా నిండిన ప్రాజెక్టు

జలాశయం నుంచి 7 వేల క్యూసెక్కులు విడుదల

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 25: కిన్నెరసాని ప్రాజెక్టు ఈ సీజన్‌లో తొలిసారి వరద నీటితో పూర్తిగా నిండింది. బుధవారం రాత్రి ప్రాజెక్టుకు చెందిన రెండు గేట్లు ఎత్తి 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసారు. కిన్నెరసాని ఎగువ ప్రాంతాల్లో కొద్ది రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఇన్‌ఫ్లో చాలా తక్కువగా ఉంటోంది. ప్రాజెక్టు అధికారులు ఇన్‌ఫ్లోను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులో నీటి లెవల్‌ను మెయిన్‌టేన్ చేస్తున్నారు. అధిక వర్షాలతో 2022లో ఓసారి ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులకు వరద చేరింది. ఆ తరువాత ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడం ఇదే తొలిసారి. ప్రాజెక్టులో బుధవారం ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులుగా ఉంది. నీటిమట్టం 407 అడుగులకు చేరింది. డ్యామ్ సైట్ అధికారులు రెండు గేట్లు ఎత్తి 7 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. వరద నీరు వదులుతున్నట్టు కిన్నెరసాని పరీవాహక ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.

విగ్రహాన్ని ఢీకొట్టిన అంబులెన్స్.. తప్పిన ప్రమాదం

రామవరం, సెప్టెంబర్ 25: రోడ్డుకు అడ్డంగా ఉన్న పశువులను తప్పించబోయిన క్రమంలో ఓ 108 అంబులెన్స్ వాహనం.. రోడ్డు పక్కనే ఉన్న విగ్రహాన్ని ఢీకొట్టింది. టేకులపల్లి మండలానికి చెందిన ఓ గర్భిణిని ఆ అంబులెన్స్ రామవరం ఎంసీహెచ్‌కి తరలిస్తున్న క్రమంలో బుధవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకుంది. రామవరం ప్రధాన కూడలిలో పశువులు రోడ్డుపై ఉన్నాయి. వాహనం దగ్గరికి వచ్చే సమయానికి పశువులు అకస్మాత్తుగా లేవడంతో కంగారు పడిన పైలట్.. వాటిని తప్పించే ప్రయత్నంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహాన్ని ఢీ కొట్టాడు. అదృష్టవశాత్తూ అంబులెన్స్‌లో ఉన్న గర్భిణితోపాటు ఆమె కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. వాహనం ముందు భాగం దెబ్బతిన్నది. పోలీసులు అక్కడికి చేరుకొని అంబులెన్స్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలి'

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 25: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు షరతులు లేకుండా రూ.5 వేల లాభాల బోనస్ చెల్లించాలని, లాభాల్లో వాటాకు సీఎంపీఎఫ్, ఈపీఎఫ్ కలిసిన కార్మికులను పరిగణనలోకి తీసుకోవాలని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి పెద్దబోయిన సతీశ్ డిమాండ్ చేశారు. బంధ్లోస్, రైటర్‌బస్తీ, బాబూక్యాంప్ తదితర కార్మికుల మస్టర్ అడ్డాల వద్ద బుధవారం జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలోని అన్ని విభాగాల్లో ఉన్న కాంట్రాక్టు కార్మికులకు వాటా చెల్లించాలని కోరారు.

పోడు సాగుదారులపై దాడులు ఆపాలి: సీపీఎం

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 25: పోడు సాగుదారులపై అటవీ శాఖ దాడులను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు. మండలంలోని బండ్రిగొండ, కోయగట్లు గ్రామాల్లో బుధవారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. పోడు సాగుదారులపై దాడులు ఆపకపోతే సాగుదారులతో కలిసి ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. నాయకులు కొండబోయిన వెంకటేశ్వర్లు, పాకాల వెంకటరావు, పదం భద్రయ్య, శ్రీను, రామ్‌దాస్, దేవా తదితరులు పాల్గొన్నారు.

హైవే అంతా.. అడుగుకో గుంత!

- భారీ గుంతలతో అవస్థపడుతున్న వాహనదారులు
- దుమ్ము, దూళితో ప్రయాణికులు, ప్రజల ఇబ్బందులు
- రోడ్డు మరమ్మతులను పట్టించుకోని అధికారులు

రింగ్‌రోడ్డు జాతీయ రహదారిపై ఉన్న భారీ గుంతలు

అశ్వారావుపేట, సెప్టెంబర్ 25 : పేరుకే జాతీయ రహదారి.. ఎటువైపు చూసినా గుంతలు, గోతుల మయం. ఇదివరకు ఉన్న గుంతలకు తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో అవి మరింతగా విస్తరించాయి. దీంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు రహదారులపై దుమ్ము, దూళి. ముందుగా వాహనం వెళ్తుంటే వెనుక నుంచి వదజల్లే దుమ్ముతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, స్థానికులు, రోడ్లకు ఇరుపక్కల వ్యాపారుల అవస్థలు. శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్న పట్టణవాసులు. ఇదంతా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని జాతీయ రహదారిపై నిత్యకృత్యం. సమైక్య రాష్ట్రంలో ఖమ్మం-దేవరపల్లి మధ్య రవాణా సౌకర్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2003లో హైవే నిర్మించింది. 2015లో స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత నేషనల్ హైవే అథారిటీ ఈ రహదారిని స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి ఏటా రహదారి నిర్వహణకు నిధులు మంజూరు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేపడుతున్నది. ఈ ఏడాది రహదారి నిర్వహణను నిర్లక్ష్యం చేయడం వల్ల మరింత గోతులమయంగా మారింది. 100 మీటర్ల దూరంలోనే అడుగుకో భారీ గుంత వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తుంది. రింగ్ రోడ్డు సెంటర్‌లో అదుపుతప్పి భారీ వాహనాలు బోల్తాపడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాగే వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి వ్యాపార సముదాయాలు, ప్రయాణికుల ముఖాలను కమ్మేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో అయితే ప్రయాణం మరింత ఆందోళన కలిగిస్తుంది. రోడ్డుపై గుంతలు వరద నీటితో నిండిపోయి ఎక్కడ ఎంత లోతున గోతులు ఉన్నాయో తెలియక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ముక్కుపిండి ట్యాక్స్ వసూలు చేస్తుందేగానీ రహదారి మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ముగ్గురు మంత్రులున్నా..

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా గిరిజన నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటకు ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు అనేక పర్యాయాలు ఈ నియోజకవర్గంలో పర్యటించినా.. కనీసం రోడ్డు మరమ్మతు గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రుల పర్యటనల సందర్భంగా అధికారులు హడావిడిగా గుంతలు పూడ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప శాశ్వత మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు, వాహనదారుల సౌకర్యార్థం వెంటనే జాతీయ రహదారిపై భారీ గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. వర్షాల కారణంగా మరమ్మతు చేయడంలో ఆలస్యమైందని, తక్షణమే మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.

పట్టణంలో కిడ్నాప్ కలకలం!

- ఆపై కథ సుఖాంతం
- సీసీ కెమెరాలపై డీఎస్పీ అవగాహన కార్యక్రమం

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 25: పట్టణంలో ఇద్దరు చిన్నారుల కిడ్నాప్ వ్యవహారం కలకలం సృష్టించింది. పోలీసుల ఎంట్రీతో బాధితుల సమీప మిత్రుల ఇంట్లోనే ఆ చిన్నారులు ఉన్నట్లు తేలింది. దీంతో కథ సుఖాంతమమైంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని హనుమాన్ బస్తీలో నివాసముంటున్న మున్సిపల్ ఏఈ రాము ఇద్దరు కుమార్తెలు బుధవారం సాయంత్రం కిడ్నాప్‌కు గురైనట్లు పుకార్లు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, త్రీ టౌన్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్లు కాగితోజు శివప్రసాద్, ముప్పారపు కరుణాకర్‌లు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఈ ప్రాంతంలో విచారణ జరిపారు. సుమారు రెండుగంటల పాటు ఉత్కంఠ కొనసాగిన అనంతరం సదరు చిన్నారులు ఏఈ రాము సమీప స్నేహితుల ఇంట్లోనే ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ రెహమాన్.. స్థానికులతో సమావేశమయ్యారు. సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై వారికి అవగాహన కల్పించారు. ప్రతీ ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా అపార్ట్‌మెంట్ల యజమానులు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

కార్మికుల నిరసన

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 25: తమకు రూ.5వేల బోనస్ చెల్లించాలన్న డిమాండుతో సోలార్ ప్లాంట్‌లోని కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం ప్లాంట్ వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నభి, నాయకులు తాళ్ళూరి కృష్ణ, ప్రేమ్‌సింగ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామలక్ష్మణులు కుటుంబానికి పరామర్శ

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 25: తెలంగాణ వాది, కార్మిక నాయకుడు గుడివాడ రామలక్ష్మణులు కుటుంబాన్ని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు బుధవారం పరామర్శించారు. రామలక్ష్మణులు మృతి వార్త తెలుసుకున్న జలగం ప్రసాదరావు.. బుధవారం అతడి ఇంటికి చేరుకొని అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చింతలచెర్వు గెర్సోమ్, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'చేయూత'

సారపాక, సెప్టెంబరు 25: మండలంధిలోని కృష్ణసాగర్ పంచాయతీ బత్తునగర్ గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోడే వెంకటేష్ ఇల్లు దగ్ధమైంది. ఆయన కుటుంబానికి మోరంపల్లిబంజర్‌కు చెందిన చేయూత ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం రూ.5వేలు అందించారు. కైపు నాగిరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, గాదె నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, శెనగ మల్లేశ్వరరావు, కామిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు శిక్షణ

పర్ణశాల, సెప్టెంబర్ 25: మండలంలోని గీత కార్మికులకు కాటమ్మ రక్షా కవచ్ శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, నాయకులు సీతమ్మ, లంకా అబ్బులు, శివాజీ, వెంకటరమణరెడ్డి, చంటి పాల్గొన్నారు.

క్రీడావిజేతలకు బహుమతుల ప్రదానం

అన్నపురెడ్డిపల్లి: బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 25: మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జోనల్ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 25: దమ్మపేటలో జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ చాటారు. బీసీ గురుకుల విద్యార్థులు అండర్-17 విభాగంలో ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో కె.అశోక్‌కుమార్, ఎ.చరణ్‌తేజ, నాగచైతన్య, కె.రోహిత్, కార్తీక్, హర్షనాయక్ విజయం సాధించి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్స్ ఎ.రేణుక, టి.సంగీత అభినందించారు.

పినపాక, సెప్టెంబర్ 25: మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో ఈబయ్యారం అడ్డరోడ్‌లోని రాధిక హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కరస్పాండెంట్ గంగిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, డైరెక్టర్లు జయసింహారెడ్డి, సంపత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నిరోష, పీఈటీ మహేష్ అభినందించారు.

పోషణ మహోత్సవాలు

టేకులపల్లి/చర్ల/దుమ్ముగూడెం, సెప్టెంబర్ 25: టేకులపల్లి, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో బుధవారం పోషణ మహోత్సవాలు జరిగాయి. టేకులపల్లి మండలం బోడు రైతు వేదికలో సీడీపీవో కె.ఎం.తార ఆధ్వర్యంలో జరిగిన సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. గర్భిణులను ఆశీర్వదించారు. తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీంద్రరావు, సులానగర్ పీహెచ్‌సీ సీహెచ్‌వో పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, యశోద, లక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు. చర్ల మండలంలోని ఆదివాసీ గ్రామం కోరుకొండలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో చైతన్య, సూపర్‌వైజర్లు స్వరూపరాణి, జగదాంబ, పోషణ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, శాంతమ్మ పాల్గొన్నారు. దుమ్ముగూడెం మండలంలోని నర్సాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ఐసీడీఎస్ సీడీపీవో నవ్యశ్రీ సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పంచాయతీ కార్యదర్శి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎంఈవోలు

నమస్తే నెట్‌వర్క్: జిల్లాలోని ఆయా మండలాలకు నియమితులైన ఎంఈవోలు బుధవారం విధుల్లో చేరారు. భద్రాచలంలో తోటమళ్ల రమ, అన్నపురెడ్డిపల్లిలో ఆనంద్‌కుమార్, చంద్రుగొండలో ఎం.సత్యనారాయణ, టేకులపల్లిలో ఎ.జగన్, ఆళ్ళపల్లిలో శాంతారావు, ఇల్లెందులో టీవీఆర్‌ఎన్ స్వామి, పినపాకలో నాగయ్య విధుల్లో చేరారు. వారికి అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

12 కేజీల గంజాయి పట్టివేత

నలుగురు అరెస్ట్.. ఒకరు పరార్..

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 25: మద్యానికి బానిసై గంజాయికి అలవాటుపడిన యువకులు మహబూబాబాద్ జిల్లాకు గంజాయిని తరలిస్తూ ఖమ్మం ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులకు మణుగూరు శివారు ప్రాంతంలో బుధవారం పట్టుబడ్డారు. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. కొందరు వ్యక్తులు సీలేరు నుంచి గంజాయిని తీసుకువస్తున్నారనే సమాచారం మేరకు ఖమ్మం ఎస్‌టీఎఫ్ ఏఈఎస్ తిరుపతి, సీఐ సుంకరి రమేశ్ సిబ్బంది కలిసి మణుగూరు రథంగుట్ట వద్ద మాటు వేశారు. రెండు బైకులపై వస్తున్న మహబూబాబాద్, జనగాం ప్రాంతాలకు నలుగురు యువకులను పట్టుకుని వారి వద్ద సంచుల్లో తనిఖీ చేశారు. వారి వద్ద 12.82 కేజీల గంజాయి లభ్యమైంది. దానిని తరలిస్తున్న జనగామకు చెందిన రేగు సంపత్, నందమాల లవ్‌కుమార్, మహబూబాబాద్‌కు చెందిన బందేల్ సాయికుమార్, బోడ వంశలను అరెస్ట్ చేశారు. మహబూబాబాద్‌కు చెందిన జానీ పరారీలో ఉన్నాడు. నిందితులు నుంచి రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రైసిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్పున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరపున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి
91827 77711

టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టి